RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక :115 | మంగళవారం 03-09-2024 | పేజీలు :04 వెల:రూ.2.00

## ఏపీకి మళ్లీ వరుణ గండం..

### ఈ నెల 5న మరో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్!

ఏపీని వరుణుడు ఇప్పుడే వదిలేలా కనిపించడం లేదు. ఇప్పటికే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తుండగా.. మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 5వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. దీని ప్రభావంతో కోస్తా తీరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీనపడుతోంది. రానున్న 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో మరో 24 గంటల్లో కోస్తాలో మోస్తారు వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్లతో ఆహారం సరఫరా చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల ద్వారా ఆహారం, ఔషధాలు, తాగునీరు వంటివి అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చినట్లు సమాచారం.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# విజయవాడ వరద ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన



### బాధితులకు ధైర్య వచనాలు
### సహాయక చర్యలు ముమ్మరం
### అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలు

అమరావతి,సెప్టెంబర్ 2 : విజయవాడ నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన ముగిసింది. సోమవారం ఉదయం నుంచి ముంపు ప్రాంతాల్లో సుమారు నాలుగు గంటల పాటు నిర్విరామ ంగా సీఎం పర్యటించారు. యనమ లకుదురు, పటమట, రామలింగే శ్వర నగర్, జక్కంపూడి, భవానీపు రం తదితర ప్రాంతాల్లో సీఎం పర్య టించి బాధితులతో మాట్లాడారు. ప్రకాశం బ్యారేజీ దిగువ లోతట్టు ప్రాంతాలు, ఎగువ ప్రాంతాల్లోనూ పర్యటించారు. వాహనం వెళ్లగలి గినంత దూరం అందులో.. మిగిలిన చోట్ల కాలినడక వెళ్లారు. కొన్నిచోట్ల మోకాలి లోతు నీటిలోనూ నడుచుకు ంటూ వెళ్లారు. బురదలో కాలినడ కనే తన పర్యటనను కొనసాగిం చారు. మరింత ఎక్కువ నీరు ఉన్న ప్రాంతాల్లో బోటు ద్వారా బాధితుల వద్దకు చేరుకుని వారితో స్వయంగా మాట్లాడి కష్టాలు తెలుసుకున్నారు. బాధితులు చెప్పే ఫిర్యాదుల పరిష్కా రానికి ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ఆదుకుంటుందని.. ధైర్యంగా ఉండాలంటూ ప్రజల్లో భరోసా కల్పిం చారు. ప్రజలను కాపాడే విషయంలో ప్రయత్నాలు ఎక్కడా ఆగకూడదని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై సోమవారం ఉదయం విజయవాడ కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఒక్క రాత్రి ధైర్యంగా ఉండాలని ముంపు ప్రాంతాల ప్రజలకు హామీ ఇచ్చానని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆ హామీ నిలబెట్టుకునే దిశగా యంత్రాంగం పనిచేయాలన్నారు. ఎంతమందిని రక్షించగలిగామన్నదే మన లక్ష్యం కావాలన్నారు. బోట్లు కూడా కొట్టుకుపోయే సవాళు మన ముందున్నాయన్నారు. బోట్లలో వచ్చిన వారిని తరలించేందుకు బస్సులు సిద్ధంగా ఉంచాలన్నారు.. అవసరమైతే వృద్ధులు, రోగులు ఇబ్బంది పడకుండా హోటళ్లలోనే ఉంచాలని ఆదేశించారు. బాధితుల కోసం కల్యాణ మండపాలు, ఇతర కేంద్రాలు సిద్ధం చేయాలన్నారు. మొత్తం 47 కేంద్రాలు గుర్తించామని సీఎంకు అధికారులు వివరించారు. ఉదయం 8 గంటల కల్లా ఎంత మందికి ఆహారం అందించారని సీఎం ఆరా తీశారు. సుమారు లక్షన్నర మంది వరకు ఆహార పంపిణీ జరిగిందని అధికారులు తెలిపారు. విపత్తు సమయంలో వరద బాధితులు తీసుకునే తాగునీరు ఎంతో ముఖ్యమని చంద్రబాబు చెప్పారు. అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ వారి కోసమే కేటాయించాలని అన్నారు. కృష్ణానది కరకట్టపై వెంకటపాలెం వద్ద గండి పడే పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. గండిని పూడ్చగలిగామని సీఎంకు అధికారులు వివరించారు. రాజధాని రైతులు స్వచ్ఛందంగా చూపిన చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. కరకట్ట వెంట గండి పడే ప్రాంతాల గుర్తింపునకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలన్నారు. తనతో సహా అధికారులంతా బృందంగా ఏర్పడాలని స్పష్టం చేశారు. విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. జోరు వర్షంలో బోటు ఎక్కి సింగ్ నగర్ లోపలికి వెళ్లారు. దాదాపు వంతెనకు ఆనుకుని ప్రవహిస్తున్న వరద నీటిని సీఎం పరిశీలించారు. బాధితులకు ఉదయమే ఆహారం అందిందా? లేదా? అని చంద్రబాబు ఆరా తీశారు. ఆహారం, రక్షిత మంచి నీరు అందాయని బాధితులు ఆయనకు తెలిపారు. విజయవాడ నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఉదయం అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం.. ఆ తర్వాత సింగ్‌నగర్ ప్రాంతానికి వెళ్లారు. బోటులో వెళ్లి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టరేట్‌కు వచ్చి మరోమారు సమీక్ష నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఆ తర్వాత మరోసారి కృష్ణలంక, జక్కంపూడి తదితర ప్రాంతాల్లో సీఎం పర్యటించారు. బాధితులతో మాట్లాడి ప్రభుత్వం తరఫున చేపట్టిన పునరావాస కార్యక్రమాలు, ఆహార పంపిణీపై ఆరా తీశారు. హెలికాప్టర్ల ద్వారా వరద బాధితులకు ఆహారం, నీళ్లు, పాలు అందజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో వరద పరిస్థితులపై మరోసారి ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. మూడుపూటలా బాధితులకు ఆహారం అందించాలన్నారు. చిన్నారులు, గర్భిణులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. బోట్లు ఎక్కడెక్కడ తిరుగుతున్నాయో మ్యాపింగ్ చేయాలన్నారు. ఒకే ప్రాంతంలో కాకుండా మారుమూల ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. మధ్యాహ్నం కొంత మేరకు వరద ప్రవాహం తగ్గుతుందని అంచనా వేశారు. లంక గ్రామాల్లో సమస్యలపై అధికారులను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అందరికీ సాయం అందుతుందని చంద్రబాబు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలకు వెంకయ్య సాయం

### విపత్తు తనను కలచివేసిందని వెల్లడి
### ప్రధాని మోడీకి ఫోన్ చేసి వివరించానని వెల్లడి



అమరావతి,సెప్టెంబర్ 2 : తెలుగు రాష్ట్రా÷-లో వరద కష్టాలపై భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విచారం వ్యక్తం చేశారు. తనకు వచ్చే పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ విరాళం ప్రకటించారు. తన కుమారుడు, కుమార్తె తరఫున కూడా విరాళం ప్రకటించారాయన. వ్యక్తిగతంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రూ. 5 లక్షలు చొప్పున సహాయం ప్రకటించగా.. తన కుమారుడు, తరఫున రూ.2.5 చొప్పున రెండు రాష్ట్రాలకు సహాయం ప్రకటించారు.ఇదే విషయమైన మీడియాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు.. కుండ పోత వర్షాలు, ఉధృతమైన వరదలతో తెలుగు రాష్ట్రాల్లో వాటిల్లుతున్న నష్టం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశానన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఇప్పటికే మాట్లాడానని, అక్కడి ప్రభుత్వాల యంత్రాంగాలతో, కేంద్ర అధికారులు టచ్‌లో ఉన్నారని ప్రధానమంత్రి చెప్పారన్నారు. రెండు రాష్ట్రాలకు తగిన సహాయ సహకారాలు అందజేస్తామని ప్రధానమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఇక తన వంతు సహకారంగా తన వ్యక్తిగత పెన్షన్ నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 5 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 5 లక్షలు సహాయ చర్యల నిమిత్తం పంపించానని వెంకయ్య నాయుడు తెలిపారు. ఈ కష్టకాలంలో ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వెంకయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు. యువత కూడా పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సహాయక చర్యల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వెంకయ్య నాయుడు కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేశారు. ఆయన కూతురు దీపా వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ నుంచి ఆంధప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేశారు.

# వరదబాధితులకు తక్షణ ఆహారం,నీరు



### డ్రోన్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు
### డ్రోన్ సర్వీసులపై సిఎం చంద్రబాబు పరిశీలన
### తోణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
### సహాయక చర్యలను పర్యవేక్షించిన బాబు, లోకేశ్



అమరావతి,సెప్టెంబర్ 2(: ఏపీలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వరద నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం.. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేసింది. వరద ముంపుకు గురైన గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం డ్రోన్లను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారికి డ్రోన్ల ద్వారా ఫుడ్ ప్యాకెట్లు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో డ్రోన్‌లను అధికారులు పరిశీలించారు. అలాగే ఫుడ్ బాస్కెట్స్ తీసుకెళ్లే విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. డ్రోన్ల ద్వారా ఫుడ్ డెలివరీ విధానాన్ని సీఎంకు ఐ అండ్ ఐ సెక్రటరీ సురేష్ కుమార్ వివరించారు. 8 నుంచి10 కేజీల వరకు ఫుడ్, మెడిసిన్, నీటిని డ్రోన్ల సరఫరా చేయొచ్చని సురేష్ కుమార్ తెలిపారు. డ్రోన్ల ద్వారా ఫుడ్ సరఫరాపై సుముఖత వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు ఎన్ని వీలుంటే అన్ని ఫుడ్ డెలివరీ డ్రోన్లను సిద్దం చేసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. వరద సహాయ చర్యల కోసం నేవీ హెలీకాప్టర్లు రంగంలోకి దిగాయి. ఇప్పటి వరకు నేవీ నుంచి మూడు హెలీకాప్టర్లు వచ్చాయి. హకింగ్‌పేట ఎయిర్ బేస్ నుంచి మరో నాలుగు హెలీకాప్టర్లు బయలుదేరాయి. వరద ముంపు ప్రాంతాల్లో హెలీ కాప్టర్ల ద్వారా ఆహారం, మంచినీరు సరఫ రాకు అధికారులు చర్యలు తీసుకు న్నారు. ఇప్పటి వరకు 2,97,500 మందికి ఆహారం, మంచినీరు అందజేశారు. నిరాశ్రయుల కోసం విజయవాడ నగరంలో 78 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా 17 చోట్ల రోడ్లు తెగిపోయాయి. దీంతో అధికార యంత్రాంగం పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రస్తుతం 11,41,276 క్యూసెక్కుల ప్రవాహం వచ్చిచేరుతోంది. వరద బాధితులకు ఆహారం, మంచినీరు పంపిణీ కార్యక్రమాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నిమగ్నమయ్యాయి. మరోవైపు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఎప్పటికప్పుడు వరద సహాయ చర్యలను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలిస్తున్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రి నారా లోకేశ్ తాజా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. వరద అంచనా, బోట్ ఆపరేషన్, ఆహారం, తాగునీరు పంపిణీ, విద్యుత్ సరఫరాపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 109 బోట్ల ద్వారా ఆహారం, తాగునీటి సరఫరాతో పాటు బాధితుల తరలింపు కొనసాగుతోంది. వరద ప్రభావిత ప్రాంతాలైన సింగ్‌నగర్, రామలింగేశ్వర నగర్ తదితర ముంపు ప్రాంతాల నుంచి 15వేలకు పైగా నిరాశ్రయులను తరలించారు. భారీ వరద కారణంగా పనిచేయకుండా నిలిచిపోయిన సెల్ టవర్స్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. విజయవాడలోని 49 ప్రాంతాల్లో 1,39,815 ఇళ్లకు నిలిచిపోయిన విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటు న్నారు. ఈ సహాయక చర్యలకు సంబంధించి వివిధ ప్రభుత్వ విభాగాధిపతులకు బాధ్యతలు అప్పగించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని లోకేశ్ సమీక్షిస్తున్నారు. డ్రోన్ల సహకారంతో వరద ముంపు ప్రాంతాల్లో సమస్యలను గుర్తిస్తూ ఆదేశాలు ఇస్తున్నారు.



## అర్ధరాత్రి బాధితులకు బాసట

### ఆహారం అందిస్తూ భరోసా ఇచ్చిన అనిత

అమరావతి,సెప్టెంబర్ 2 : ఆంధప్రదేశ్‌ను వరదలు ముంచెత్తాయి. భారీ వర్షాలకు గ్రామాలు, రోడ్లు.. వాగులు, నదులను తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా నీట మునిగిన ఇళ్లే కనిపిస్తున్నాయి. ప్రజలు నానావస్థలు పడుతూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే బాధితులను రక్షించేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. వరద బాధితులను అండగా నిలిచేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రణాళికలు రచించి వాటిని పక్కాగా అమలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు రాత్రంతా వరదముంపు ప్రాంతాల్లో పర్యటించగా.. ఆయనతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం బాధితులకు అండగా నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం అర్ధరాత్రి సమయంలో విజయవాడలోని బుడమేరు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. రాత్రి మె?త్తం పర్యటిస్తూ వరదల్లో చిక్కుకుని ఆకలితో అలమటిస్తున్న వందలాది మంది ప్రజలకు దగ్గరుండి మరీ ఆహారాన్ని పంపిణీ చేసే పనులను నిరంతరం పరిశీలించారు. ఐఏఎస్ అధికారులు సిద్దార్థ్ జైన్, వీరపాండ్యన్ వంటి అధికారులతో చర్చలు జరిపి ఆహారాన్ని బాధితుల వద్దకు చేర్చేందుకు కృషి చేశారు. ఆహార పొట్లాల్లో భోజనం, తాగునీరు సహా అన్ని ఉండేలా సమకూరుస్తున్నారా లేదా అని హోంమంత్రి స్వయంగా పర్యవేక్షించారు. సహచర మంత్రి కొల్లు రవీంద్రతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహించారు. ఏ ఒక్కరూ ఆకలితో లేకుండా చూడాలంటూ అధికారులను ఎప్పటికప్పుడు ఆదేశిస్తూ బాధితుల వద్దకు ఆటోలలో ఆహారాన్ని తరలించారు.



# సంపాదకీయం

మంగళవారం 03-09-2024

## హైడ్రా లాంటి సంస్థలతోనే విపత్తుకు విముక్తి

వానలు, వరదలు వచ్చి ఎక్కడికక్కడ మునిగిపోతున్నాయి. కారణం ఒక్కటే... నీటి పారుదల వ్యవస్థలు దెబ్బతినడమే. దాదాపు 25 లక్షల గృహాలున్న హైదరాబాద్ నగరంలో నిజాం కాలం నుండి కొన్ని వేల నీటి కుంటలు, చెరువులు, సరస్సులు, నాలాలు ఉండేవి. అనేక తోటలతో అందమైన నగరంగా విలసిల్లింది. కానీ వాటిలో 60-70 శాతం అక్రమంగా ఆక్రమించి పెద్ద భవనాలు, పరిశ్రమలు, నివాస గృహాలు, ఫామ్ హౌస్‌లు, అపార్ట్ మెంట్లు, ఫార్మా సిటీలు నిర్మించారు అక్రమదారులు..భాగ్యనగరంలో వర్షాకాలం వస్తే చాలు నీరు ఉప్పొంగి రోడ్లను, గృహ సముదాయాలను వరద ముంచెత్తుతోంది. దీంతో నీటి వనరుల పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం "హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్" (హైడ్రా)ను ఏర్పాటు చేసింది. నిబంధనలను ఉల్లంఘించి, చట్ట వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడితే తప్పకుండా వాటిని కూల్చి వేయవలసిందే. దీనికి సామాన్య ప్రజల నుండి హృదయ పూర్వకంగా అభినందనలు ప్రభుత్వానికి వస్తున్నాయి.హైదరాబాద్ భాగ్యనగరంగా ప్రసిద్ధి. నిజాం రాజ్యానికి రాజధాని. 500 సంవత్సరాల పైబడిన పురాతన చారిత్రక నగరం. ఈ నగరం ఇప్పుడు సురక్షత, ఆవాసయోగ్యమైన, విశ్వనగరంగా విఖ్యాతి గాంచింది. ఈ మహానగరంలో ఒక్క తెలుగు వారే కాక దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు ఉద్యోగ, ఉపాధి కోసం వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. చిరు వ్యాపారం చేసుకునే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. కోటికి పైగా జనాభా వున్న రాజధానిలో ఫ్లోటింగ్ పాపులేషన్ కూడా సుమారు 1 లక్షా 50 వేల మంది ఉంటారని ప్రభుత్వ అంచనా. వీరందరికి తగినంతగా తాగునీరు, ఇతర అవసరాలకు సరిపడా నీటి వసతి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, తర్వాత తెలంగాణను వరుసగా పాలించిన ప్రభుత్వాలు.. చెరువులపై అక్రమ నిర్మాణాలకు అలవోకగా అనుమతులిచ్చేశాయి. దీంతో వర్షాకాలంలో నీరు సహజంగా ప్రవహించి చెరువులలోకి చేరకుండా ఈ అక్రమ కట్టడాలు అడ్డుకుంటున్నాయి. దీంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుంది. ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజా జీవితం దుర్భర మౌతుంది.నీటి వనరుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పరచిన హైడ్రా ఉద్దేశం చాలా మంచిది. నిబంధనలను ఉల్లంఘించి, చట్ట వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడితే తప్పకుండా వాటిని కూల్చి వేయవలసిందే. అందుకే ప్రభుత్వానికి సామాన్య ప్రజల నుండి హృదయ పూర్వకంగా అభినందనలు వస్తున్నాయి. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు కూడా సానుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వ, ప్రజల ఆస్తుల పరిరక్షణ ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరుల పరిరక్షణ అవసరం. అయితే హైడ్రా పనితీరుపై కొన్ని విమర్శలు వస్తున్నప్పటికీ హైడ్రా సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు.అయితే ఈ ప్రక్రియ ఆరంభ శూరత్వం కాకూడదు. ఇకముందు అక్రమ కట్టడాలు లేకుండా ప్రభుత్వ ఆస్తులకు కంచెలు వేయాలి. సైన్ బోర్డులు తగిలించాలి. నిష్పాక్షికంగా, పారదర్శకంగా, రాజకీయ పార్టీలకు అతీతంగా హైడ్రా చట్టబద్ధంగా పనిచేయాలి. అది నిరూపించడం కోసం మొదట కాంగ్రెస్ నాయకుల ఆక్రమణలపై కూల్చివేతలు ప్రారంభించి, విపక్షాల అక్రమ కట్టడాల జోలికి వెళ్లాలి. ప్రభుత్వం తనవారు, పరాయివారు అనే పక్షపాతం ఎట్టి పరిస్థితుల్లో చూపరాదు. చెరువులు, కుంటలు, ఇతర సహజ వనరుల రక్షణ చేపట్టాలి. ధనికులకు, పారిశ్రామిక వేత్తలకు, సినీ సెలబ్రిటీలకు అనుచిత మర్యాదలు చూపి చట్ట వ్యతిరేక చర్యలకు మద్దతు ఇవ్వరాదు. రాగ ద్వేషాలకు, రాజకీయ కక్ష సాధింపులకు హైడ్రాను వాడరాదు. స్వపక్షం, విపక్ష హోదాలకు అతీతంగా హైడ్రా పనిచేయాలి.అయితే, ఇప్పటికే అక్రమ కట్టడాలలో ఇళ్లు కొనుక్కున్న వారికి బిల్డర్స్ ఆస్తులను జప్తు చేసి నష్టపరిహారం ఇవ్వాలి. పేదవారి ఇళ్లను కూల్చినప్పుడు వారికి వెంటనే ప్రభుత్వ భూమి ఇవ్వాలి. లేదా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి. లేదా తగిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలి. బిల్డర్లతో కుమ్ముక్కై ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు, లేఅవుట్ పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. వారి ఆస్తులు జప్తు చేసి, జైలుకు పంపాలి. చెరువులపై కట్టిన కట్టడాలను కూల్చినప్పుడు కట్టడాల వ్యర్థాలను తీసివేసి చుట్టూ కంచె వేసి, పరిసర కాలనీ వాసులకు చెరువుల పరిరక్షణా బాధ్యతలను అప్పగించాలి. ప్రతి జిల్లాలోనూ హైడ్రా వంటి సంస్థలను ఏర్పాటు చేయాలి. చెరువులు, కుంటలు, నాలాలు చెక్ డ్యాముల పరిరక్షణకు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రజా సంఘాలను ఏర్పాటు చేసి వారికి బాధ్యత, అధికారాలు అప్పగించాలి. ప్రభుత్వ చిత్తశుద్ధే హైడ్రా విజయానికి ఆధారమవుతుంది.

## 2005 తర్వాత... బెజవాడ మునిగింది



విజయవాడ, సెప్టెంబర్ 2 సరిగ్గా 20ఏళ్ల తర్వాత విజయవాడ నగరం ముంపుకు గురైంది. వాగులు, వంకలు ఆక్రమణకు గురైతే ప్రకృతి కన్నెర చేస్తుందని మరోసారి రుజువైంది. 20ఏళ్ల క్రితం చేపట్టిన ఆపరేషన్ కొల్లేరు అర్థాంతరంగా నిలిచిపోవడంతో దానికి మూల్యం చెల్లించుకుంటున్నారు. 20ఏళ్లలో విజయవాడ నగరం ఊహించని వేగంగా విస్తరించడం, బుడమేరు ప్రవాహ మార్గాన్ని కబ్జా చేయడమే ప్రస్తుత పరిస్థితికికారణమైంది.విజయవాడ నగరానికి పక్కగా ప్రవహించే కృష్ణానదికంటే నగరం మధ్యలో ప్రవహించే బుడమేరుతో దశాబ్దాలుగా దానికి ముప్పు పొంచి ఉంది.2005లో చివరి సారి బుడమేరు బెజవాడ పుట్టిముంచింది. 2005సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలతో నగరం అతలాకుతలమైంది. విజయవాడ మూడొంతులు ముంపుకు గురైంది. వరదల కారణంగా విజయవాడలో కార్పొరేషన్ ఎన్నికలు సైతం వాయిదా పడ్డాయి. దీనికి ప్రధాన కారణం బుడమేరు ఉగ్రరూపంతో ప్రవహించడమే. రికార్డు స్థాయిలో ఎగువున ఖమ్మం జిల్లా నుంచి వరద ప్రవాహం పోటెత్తడంతో అదంతా విజయవాడను ముంచెత్తింది.ఖమ్మం జిల్లాలో పుట్టే బుడమేరు ఏటా సాధారణ సీజన్‌లో గరిష్టంగా 11వేల క్యూసెక్కుల ప్రవాహంతో ప్రవహిస్తుంది. 2005లో అది 70వేల క్యూసెక్కులకు చేరింది. బుడమేరు ప్రవాహాన్నినియంత్రించడానికి వెలగలేరు వద్ద ఓ రెగ్యులేటర్‌ను కూడా 70వ దశకంలో నిర్మించారు. వెలగలేరు మీదుగా ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, విజయవాడ రూరల్ మీదుగా నగరంలోకి ఇది ప్రవేశిస్తోంది.2005లో వచ్చిన వరదలకు కారణాలను వివరిస్తూ సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుడు కొల్లి నాగేశ్వరరావు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బుడమేరు ముంపుకు శాశ్వత పరిష్కారం చూపకపోతే కృష్ణా జిల్లాకు ఎప్పటికీ ముంపు పొంచి ఉంటుందని ఆందోళనకు దిగడంతో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి స్వయంగా విజయవాడ వచ్చారు. విజయవాడలో ఉన్న వరద పరిస్థితి మొత్తాన్ని ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. బుడమేరు ప్రవాహాన్ని కట్టడి చేయాలంటే దానిని మళ్లించడం ఒక్కటే మార్గమని భావించారు.పోలవరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలను కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలో కలిపే డిజైన్ అప్పటికే ఖరారైంది. బుడమేరు ప్రవాహానికి దిగువన పోలవరం కుడికాల్వ కృష్ణానదిలో గుర్తించి అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని అధికారులకు నాటి సీఎం వైఎస్సార్ సూచించారు. విజయవాడ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బుడమేరు మలుపులు సరి చేసి నీటి ప్రవాహం నేరుగా కొల్లేరుకు చేరేలా చూస్తామని, వరదల్లో నీటి ప్రవాహం వెనక్కి ఎగదన్నకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పోలవరం కుడి కాల్వ నిర్మాణంలో భాగంగా 2007-08 నాటికి బుడమేరు దిగువ ప్రవాహాన్ని కుడి కాల్వలోకి మళ్లించారు. కొత్తగా మరో కాల్వను తవ్వకుండా విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వచ్చే జలాలను కృష్ణా నదిలో కలిపే కాల్వలోకి మళ్ళించారు.ఇక్కడే సాంకేతికంగా ఓ సమస్య తలెత్తింది. పోలవరం కుడి కాల్వను గరిష్టంగా 37,500 క్యూసెక్కుల ప్రవాహం ఉండేలా డిజైన్ చేశారు.విటిపిఎస్ మీదుగా ప్రవహించే కాల్వలకు అంత సామర్థ్యం లేదు. వాటిని వరద ప్రవాహానికి అనుగుణంగా పెంచాలని ప్రతిపాదనలు ఉన్నా, థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లోపల కాల్వలను విస్తరించే పరిస్థితి లేకపోవడంతో బుడమేరు వరద ప్రవాహానికి అనుగుణంగా కాల్వల సామర్థ్యం పెరగలేదనే వాదన ఉంది. దీనికి తోడు కృష్ణానది ముఖ ద్వారంలో ఉన్న నిర్మాణాలు కూడా వరద ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.విటిపిఎస్ నుంచి కృష్ణా నదిలోకి బుడమేరు వరద నీరు చేరాలంటే కృష్ణానదిలో నీటి మట్టం తగిన స్థాయిలోఉండాలి. కృష్ణా నదిలో ఎగువ నుంచి వరద కొనసాగే సమయంలో బుడమేరు నుంచి వచ్చే వరద ప్రవాహం నదిలోకి చేరదు. అదే సమయంలో పోలవరం కుడి కాల్వ నుంచి నీటి విడుదల కొనసాగితే వరద ప్రవాహం దిగువన విజయవాడ వైపే వెళ్లాల్సి ఉంటుంది.20ఏళ్ల క్రితం వచ్చిన వరదల్లో విజయవాడ నగరంలో న్యూ రాజరాజేశ్వరి పేట, సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. రోజుల తరబడి ప్రజలు వర్షపు నీటిలో చిక్కుకుపోయారు. బుడమేరుకు వెలగలేరు రెగ్యులేటర్ దిగువన మళ్లింపు చేపట్టగానే విజయవాడకు వరద ముంపు తప్పిపోయింది.2008 నుంచి విజయవాడ రూరల్ మండలంలో వేగంగా నిర్మాణాలు విస్తరించాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏకంగా నగరంలో మరో కొత్త ప్రాంతాలు ఏర్పడ్డాయి. విజయవాడ సెంట్రల్ నియోజక వర్గం పరిధిలో న్యూ రాజరాజేశ్వరిపేట ఎక్స్‌టెన్షన్, నందమూరి నగర్ వంటి ప్రాంతాలు విస్తరించాయి. అంతకు ముందు అదంతా బుడమేరు పరివాహక ప్రాంతమనే సంగతిని పూర్తిగా విస్మరించారు.2005లో చేపట్టిన బుడమేరు డైవర్షన్ పనులు పూర్తిగా అటకెక్కిన సంగతి కూడా ప్రజా ప్రతినిధులు విస్మరించారు. బుడమేరు ప్రవాహం విజయవాడ నగరంలోకి రాకుండా ఏర్పాటు చేసిన కరకట్టను 2008 నుంచి పూర్తిగా ధ్వంసం చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ కరకట్ట ఇప్పుడు ఆనవాళు కూడా లేకుండా పోయింది. సుందరీకరణ పేరుతో నగరానికి రక్షణగా ఏర్పాటు చేసిన వ్యవస్థల్ని రాజకీయ నాయకులు యథేచ్ఛగా ధ్వంసం చేశారు. కాలనీలకు కాలనీలను విస్తరించి నివాస ప్రాంతాలను విస్తరించడంలో 2009 నుంచి విజయవాడలో ఎన్నికైన ఎమ్మెల్యేలు కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీలకు ఇందులో భాగస్వామ్యం ఉంది.బుడమేరు ఉగ్రరూపం దాల్చినపుడు నీటి ప్రవాహానికి అనుగుణంగా పలు చోట్ల మలుపులు ఏర్పడ్డాయి. రెండు, మూడు దశాబ్దాల క్రితం నాలుగైదేళ్ల క్రితం బుడమేరుకు వరదలు వచ్చినా పంట పొలాలు మాత్రమే నీట మునిగేవి. బుడమేరు ప్రవాహంలో ఉన్న మలుపులు నీటి సహజ ప్రవాహ వేగాన్ని తగ్గించి ఊళ్లను ముంచెత్తుతున్నాయని, విజయవాడ, నిడమానూరు ప్రాంతాల్లో ఉన్న "యూ" టర్నింగ్‌లను నవరించాలని 20ఏళ్ల క్రితమే ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించింది.బుడమేరును ఆక్రమణల నుంచి విడిపించి దాని గరిష్ట సామర్థ్యానికి అనుగుణంగా విస్తరించాలని ప్రతిపాదించారు. విజయవాడ మార్కు రాజకీయం ఆ పనుల్ని అడ్డుకుంది. ఇళ్లను తొలగిస్తే ఊరుకోమని హెచ్చరించడంతో ప్రభుత్వం కూడా వదిలేసింది. ఇదే అదనుగా బుడమేరును యథేచ్ఛగా ఆక్రమించేశారు. ఇక విటిపిఎస్ నుంచి ప్రవహించే వరద ప్రవాహ మార్గంలో ఉన్న నిర్మాణాలు కూడా విజయవాడ ముంపుకు కారణమవుతున్నాయి. వాటిని సరిచేసే సంకల్పం ఏ పార్టీకి లేకపోవడమే ప్రస్తుత పరిస్థితి కారణమైంది.ప్రపంచంలోనే అతిపెద్ద మంచి నీటి సరస్సుకు నీటిని అందించే నీటి వనరుల్లో బుడమేరు ఒకటి, పశ్చిమగోదావరిలో తమ్మిలేరు, ఎర్రకాల్వలతో పాటు కృష్ణాలో బుడమేరు కొల్లేరుకు ప్రధాన నీటి వనరుగా ఉంటుంది. కొల్లేరులో వరద ప్రవాహాన్ని స్వీకరించకుండా ఆక్రమణలతో నిండిపోవడంతో వరదలు దిగువకు చేరడంలో జాప్యం జరుగుతోంది. ఖమ్మం, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో ప్రవహించే వర్షపు నీరంతా బుడమేరు ద్వారా 170కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించి కొల్లేరును చేరుతుంది.

## 7న మద్యం షాపుల బంద్



నెల్లూరు, సెప్టెంబర్ 2 ఏపీలో త్వరలోనే కొత్త మద్యం పాలసీ తెరపైకి రానుంది. గత ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో అడ్డగోలుగా వ్యవహరించిందని డిజిటల్ పిమెంట్స్ కు అనుమతి ఇవ్వకుండా కేవలం డైరెక్ట్ క్యాష్ తీసుకుంటూ కోట్ల రూపాయలను పక్కదారి పట్టించారు అని కూటమి ప్రభుత్వం మొదటి నుంచీ ఆరోపిస్తోంది. సొంత మద్యం బ్రాండ్లతో అటు ప్రజల ఆరోగ్యం ఇటు ప్రభుత్వ ఖజానా రెండింటికీ దెబ్బకొట్టారు అని ఎన్నికల సమయంలో తీవ్రంగా ప్రచారం చేశారు. నిజానికి నాటి వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు కాస్త ముందుగా మాత్రమే మద్యం దుకాణాల్లో డిజిటల్ పెమెంట్ లకు అనుమతి ఇచ్చింది. ఇవన్నీ నాటి పాలనపై అనుమానాలు సృష్టించింది అనేది స్పష్టం.ఏపీలో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రకటించిన వైట్ పేపర్స్ లో మద్యం పాలసీ కూడా ఒకటి. ఏకంగా అసెంబ్లీలోనే శ్వేత పత్రాన్ని రిలీజ్ చేసిన చంద్రబాబు గత వైసీపీ పాలనలో మద్యం టెండర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్నారు. దేశ వ్యాప్తంగా మద్యం వినియోగం పెరిగిన వేళ పక్క రాష్ట్రాల్లో ఆదాయం పెరిగితే ఏపీలో మాత్రం తగ్గింది అన్నారు. అప్పటి పాలకులు ఏపీ ఖజానాకు రావల్సిన ఆదాయాన్ని సైడ్ ట్రాక్ పట్టించడం వల్లే ఈ పరిస్థితి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారుప్రస్తుతం ఏపీలో మద్యం పాలసీ ఎలా ఉండాలి అనేదానిపై అధ్యయనం చేయడానికి మంత్రులతో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశారు ముఖ్యమంత్రి. ఆ కమిటీలో సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, గొట్టిపాటి రవి, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. వీరు పక్క రాష్ట్రాలు ముఖ్యంగా తెలంగాణలో అమలవుతున్న మద్యం పాలసీలను పరిశీలించి దానికి అనుగుణంగా కొత్త పాలసీకి తగిన సూచనలను ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతారు. అనంతరం అక్టోబర్ 1 న ఏపీలో కొత్త మద్యం పాలసీని సీఎం ప్రకటిస్తారు.కొత్త మద్యం పాలసీలో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసేసి ప్రైవేటుపరం చేస్తారు అనేది ఇప్పుడు ఏపీలో హాట్ టాపిక్ గా మారింది. దానితో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇప్పుడు రోడ్డెక్కారు. ముందు తమ ఉద్యోగాల సంగతి తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం పేపర్ నోటిఫికేషన్ ఇచ్చి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా తమ ఉద్యోగాల ప్రక్రియ పూర్తి చేశారని కానీ ఐదేళ్లుగా పని చేస్తున్న తమకు సరైన సమయానికి జీతాలు ఇవ్వలేదని వారు అంటున్నారు. పైగా తమకు రావల్సిన ఖఈ,ూ,ఇూఎల డబ్బును కూడా ఏజెన్సీలు తినేసాయని ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుంది అనుకుంటే ఇలా అర్ధాంతరంగా తమను రోడ్డున పడేశారని వాపోతున్నారు. అందుకే కొత్త మద్యం పాలసీ ప్రకటించేలోపు తమ ఉద్యోగాలపై స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ కోణంలోనే సెప్టెంబర్ 4 నుంచి నిరసనలు చేస్తామని సెప్టెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల బంద్ చేపడతామని ఏపీ బేవరేజేస్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రస్తుతం ఏపీలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 18వేల మంది వరకూ పనిచేస్తున్నారు. అన్నివేల కుటుంబాలను ఒక్కసారిగా రోడ్డున పడేయకండి అంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## హద్దు మీరుతున్న సొంత పార్టీ నేతలు

తిరుపతి, సెప్టెంబర్ 2 ఏపీ సీఎం చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలకు కీలక ఆదేశాలు ఇచ్చారు.ప్రత్యేక పరిస్థితుల్లో ఏపీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని.. ప్రజల ఆంక్షలు, ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకుందామని పిలుపునిచ్చారు. కూటమికి తలవొంపులు తెచ్చేలా ఎవరు వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు.డిప్యూటీ సీఎం పవన్ సైతం మనపై ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారని.. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉందామని ఎమ్మెల్యేలకు సూచించారు. తాను తప్పు చేసిన చర్యలు తీసుకోవాలని సభాముఖంగానే కోరారు పవన్ కళ్యాణ్.అయితే కొంతమంది ఎమ్మెల్యేలు,మంత్రుల వ్యవహార శైలి భిన్నంగా ఉంటోంది. వారి కుటుంబ సభ్యులు సైతం దూకుడుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వానికి తల వంపులు తప్పేలా లేవు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ మంత్రి భార్య అయితే.. తనకు ఎస్కార్ట్ పోలీసుల వాహనం కావాలని పట్టు పట్టారు.పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పెద్ద వివాదమే నడిచింది. సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.సీఎం చంద్రబాబు వరకు వెళ్లడంతో ఆయన మందలించారు. మరోసారి ఆ ఘటన పునరావృత్తం కాకూడదని ఆదేశాలు ఇచ్చారు. దానిపై సదరు మంత్రి సంజాయిషీ ఇచ్చారు.

## ప్రతి 15 రోజులకొక డామేజ్

విజయవాడ, సెప్టెంబర్ 2 వైసీపీకి భారీ డ్యామేజ్ జరుగుతోందా? ఆ పార్టీ నైతికత దెబ్బతింటోందా? అది చేజేతులా హై కమాండ్ చేసుకున్న నష్టమా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక పద్ధతి ప్రకారం వైసిపి నైతికత దెబ్బతినేలా ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్షం రోజులకు ఒక వీడియో బయటకు వస్తోంది. తొలుత విజయసాయిరెడ్డి ఎపిసోడ్ నడిచింది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భర్త తెరపైకి వచ్చారు. తన భార్య కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. విజయసాయి రెడ్డి పై అనుమానం వ్యక్తం చేశారు. డీఎన్ఏ టెస్ట్ కు డిమాండ్ చేశారు. కానీ ఎందుకో ఆయన అనుమానాలను నివృత్తి చేసేలా.. వైసీపీ నుంచి ఎటువంటి సమాధానం లేదు. కానీ ఇష్యూను డైవర్ట్ చేసి సైలెంట్ అయ్యారు. అటు తరువాత ఎమ్మెల్సీ దువ్వాడ ఫ్యామిలీ వ్యవహారం బయటపడింది. కుటుంబ కథ అనుకున్నా.. ఇంతటి విభాగానికి ఓ మహిళ కారణమని బయటపడింది. దాదాపు పక్షం రోజులు రచ్చ నడిచింది. ఇప్పటికీ ఫుల్ స్టాప్ పడడం లేదు. ఇంతలోనే ఎమ్మెల్సీ అనంత బాబు అసభ్య వీడియో బయటకు వచ్చింది. అది మార్ఫింగ్ చేసిన వీడియో అంటూ చెబుతున్నా.. బాధితులే స్వయంగా బయట పెట్టడంతో వైసిపికి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇలా మొత్తం ఎపిసోడ్లలో వైసిపి నైతికత దెబ్బతింది.వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఇటువంటివి జరిగాయి. కానీ అధికారంలో ఉండడంతో అన్ని కొట్టుకెళ్ళాయి. కానీ ఇప్పుడు విపక్షానికి వచ్చేసరికి సీన్ సితార్ అవుతోంది. ప్రజాక్షేత్రంలో ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. మాంసం తిన్నామని ఎముకలు మెడకు కట్టుకుంటే ఎలా ఉంటుందో.. వైసిపి చర్యలు అలానే ఉండేది. కానీ ప్రతిపక్షంలో వచ్చేసరికి అవన్నీ వికటించాయి. వైసీపీ నైతికతను ప్రశ్నించే పరిస్థితికి దాపురించాయి.వైసీపీలోని మాజీ మంత్రుల్లో ఒకరు అరగంట అన్నారు.


## గవర్నర్ పదవిని రద్దు చేయాలి: అభిషేక్ సింఘ్వీ



న్యూఢిల్లీఆగస్టు 2,: గవర్నర్ పదవిని రద్దు చేయాలని లేదా చిల్లర రాజకీయాలకు పాల్పడని వ్యక్తిని ఏకాభిప్రాయంతో నియమించాలని కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ అన్నారు.గవర్నర్‌లు, ప్రతిపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రికి సవాల్‌గా లేదా బెదిరింపుగా మారితే గవర్నర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎందుకంటే ఎన్నికలు జరిగేది సీఎంను ఎన్నుకునేందుకు కానీ, గవర్నర్‌ను ఎన్నుకునేందుకు కాదని అన్నారు.కాగా, గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచడంపై అభిషేక్ సింఘ్వీ మండిపడ్డారు.గవర్నర్లు బిల్లులను ఆమోదించకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. దీని వల్ల పరిపాలన బాధాకరంగా మారుతోందని, ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయని తెలిపారు.మరోవైపు గవర్నర్ మరో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లా, ఒకే ఒరలో రెండో కత్తిలా వ్యవహరిస్తున్నారని అభిషేక్ సింఘ్వీ విమర్శించారు. గవర్నర్‌లు, సీఎంల కోసం అంబేద్కర్ రూపొందించిన సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం సిగ్గులేకుండా ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కర్ణాటక వంటి విపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్‌ల మధ్య పదేపదే ప్రతిష్టంభనలు నెలకొంటున్న నేపథ్యంలో సింఘ్వీ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.

## సోనియా, రాహుల్‌పై తప్పుడు వార్తలు.. బంగ్లాదేశ్ జర్నలిస్ట్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

న్యూఢిల్లీఆగస్టు 2,: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బంగ్లాదేశ్ జర్నలిస్ట్‌తో పాటు దేశానికి ఓ న్యూస్‌పోర్ట్‌కు చెందిన ఉద్యోగిపై బెంగళూరు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జర్నలిస్ట్ సలా ఉద్దీన్ షోయబ్ చౌదరి, అతిథిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ నేత శ్రీనివాస్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోనియా గాంధీని విదేశీ గూఢచారి అంటూ బంగ్లాదేశ్ జర్నలిస్ట్ షోయబ్ చౌదరి తన ట్విట్టర్ అకౌంట్‌లో పోస్ట్ పెట్టారని.. అలాగే రెండుమతాల మధ్య చిచ్చు పెట్టాలనే ఉద్దేశంతో జర్నలిస్ట్ ఈ పోస్ట్‌ని షేర్ చేసినట్లు తెలిపారు. రాహుల్ గాంధీపై సైతం ఆరోపణలు చేసినట్లు శ్రీనివాస్ పిటిషన్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓ సీనియర్ పోలీస్ అధికారి మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. 196, 353 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కేసును విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.



## పేదల గుండెచప్పుడు... వైయస్సార్ 15వ వర్ధంతి ఆకుమల్ల గ్రామం



శ్రీ ప్రస్థానం న్యూస్ ; సంజామల మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామములో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి పురస్కరించుకొని ఆకుమల్ల గ్రామంలో వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల గుండె చప్పుడు వైయస్సార్ అని మాజీ సొసైటీ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఉయ్యాలవాడ కాసిం భాష, ఉపసర్పంచ్ హాజీపీరా, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ హుసేని, వెంకటేశ్వర రెడ్డి ఎద్దుల మోహన్ రెడ్డి ఉంగర హుస్సేన్ రెడ్డి, ధర్మారెడ్డి హుస్సేన్ రెడ్డి శేఖర్ అప్ప వెంకట్రామిరెడ్డి, భాస్కర్ రెడ్డి ఆదినారాయణ, తులసి రెడ్డి భూపాల్ రెడ్డి, పుల్లయ్య చాకలి మధు,దానం,చిన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు

## గ్రామాల్లో మట్టి మిద్దెలలో నివసించే వారికి నోటీసులు ఇవ్వండి.

ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టి మిద్దెలలో నివసించే వారికి పంచాయతీ కార్యదర్శులు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూరుద్రవరం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీ కార్యదర్శులు మరియు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ రక్షిత మంచినీటి సరఫరా చేసే ట్యాంకులను క్లోరినేషన్ చేయించి ఈ యాప్ లో అప్లోడ్ ప్రతి నెల 2వ తేదీ మరియు 17 వ తేదీ అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి డ్రై ఫ్రైడే రోజున శానిటేషన్ చేసీ పి ఆర్ అప్లోడ్ 1యందు. చేయాలన్నారు.

## ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి.

తహశీల్దార్ మల్లికార్జునరావు.
వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ.
సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్. ఏవో.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని అన్ని గ్రామాల రైతులు ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల తహశీల్దార్ మల్లికార్జునరావు, వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మరియు మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఈ పంట నమోదుపై గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ మాట్లాడుతూ మండలంలో 21500 ఎకరాలలో పంటలు సాగు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు 10500 ఎకరాలు ఈ పంట నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఖచ్చితంగా పంట నమోదు చేసుకోవాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ,రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు..





కుక్కునూరు విలేకరి (శ్రీ ప్రస్థానం) సెప్టెంబర్ 02:-ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు కుక్కునూరు మండలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు . ఈ జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటాయి. ఉదయం స్థానిక శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొణిదెల పవన్ కళ్యాణ్ గోత్రనామాలతో ప్రత్యేక పూజల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర అనే కార్యక్రమం శ్రీకారం చుట్టారు. కివ్వక ఆర్ అండ్ ఆర్ కాలనిలో మొక్కలు నాటి వాటికి నీళ్లు పోశారు. అలాగే కుక్కునూరు కేంద్రం ప్రధాన కూడలి లో 10 కేజీల కేక్ కట్ చేసి అనంతరం భారీ ద్విచక్ర వాహన ర్యాలీ చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా తెలుగుదేశం, బీజేపీ అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరావు, తూము వెంకన్న పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి జనసేన అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూటమి అధికారంలో ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి సీనియర్ నాయకులు కోటగిరి సత్యానరాయణ, టీడీపీ ఉపాధ్యక్షులు మధుర వెంకట రమణ,చుంచు సత్యనారాయణ, నకిరికంటి భాస్కర్ రావు, ఎంపీటీసీ ముప్పాలా శివయ్య, కుక్కునూరు ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, దండబత్తుల నరసింహ రావు, తెలుగు యువత అంగిరేకుల బాలాజీ, ఏల్ టీ మోహన్ రావు, తెలుగు మహిళా వనమా భాగ్యలక్ష్మి, గారటం రమణ, హసీనా జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ, మోదుంపురపు వెంకన్న బాబు, లక్ష్మణ స్వామి, గంధం నాగరాజు,కుక్కునూరు సీతారామయ్య, చినేని సురేష్, రాయి కృష్ణర్జునరావు, చల్లకోటి శివ, గుగులోతు బాబు, కొండపల్లి శ్రీను, ముదిగొండ రఫీ, పసుపులేటి నవీన్, తాంద్ర రావి ప్రసాద్, చల్ల కోటి, నూకల వినోద్, ఆవుల వెంకటేశ్వర్లు, గాడిద వెంకటేశ్వర్లు, అమరావరపు సాయి, పోదిల్ల ధనుస్వామి, కొల్లు వెంకన్న బీజేపీ రామాచారి కూటమి సభ్యులు గ్రామ ప్రజలు. కూటమి నాయకులు, కార్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.
ఎస్ ఎస్ ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే.







నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని శ్రీరంగాపురం పరిధిలో నెలకొన్న తెలుగు గంగ కాలువలు, ఎస్ ఎస్ ట్యాంక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆయా శాఖల అధికారులు నాయకులతో కలసి శ్రీరంగాపురం గ్రామానికి వెళ్లారు. అక్కడి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామానికి తెలుగంగ ప్రధాన కాలువ నుంచి ప్రత్యేకంగా ఒక తూము ఏర్పాటు చేయడంతో పాటు అసంపూర్తిగా ఉన్న పంట కాలువలను పూర్తి చేయించాలని కోరారు. అలాగే గ్రామం పక్కనే ఉన్న ఎస్ఎస్ ట్యాంకు నిరుపయోగంగా ఉందని నీరు నిల్వ ఉండే డ్యాం కట్టకు గండిపడి ఏళ్లు గడుస్తుందని అటు తెలుగు గంగ, ఎస్ ఎస్ ట్యాంకు సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలుగు గంగ సమస్యలను శిథిలావస్థలో ఉన్న ఎస్ ఎస్ ట్యాంక్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. ఇందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో నివేదికలు సిద్ధం చేయించి వాటిని సీఎంకు వివరిస్తానని చెప్పారు. ప్రభుత్వం నిధులు, అనుమతులు ఆలస్యమైతే తన సొంత నిధులతో ఎస్ఎస్ ట్యాంకు డ్యామ్ కట్ట గండిని పూడ్చిపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, యర్రం ప్రతాపరెడ్డి, శేఖర్ యాదవ్, శ్రీనివాసులు యాదవ్, శివ యాదవ్, రఘునాథ్ రెడ్డి, నాగయ్య, దస్తగిరి,తదితర తెలుగుదేశ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడుగు బలహీవర్గాల ఆశా జ్యోతి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి..



దొర్నిపాడు,సెప్టెంబర్:02, శ్రీ ప్రస్థానం న్యూస్:- బడుగు బలహీవర్గాల జీవితాల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి,అని మండల వైఎస్సార్సీపీ నాయకులు బత్తుల నాగేశ్వర యాదవ్ అన్నారు.సోమవారము దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి,15 వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక అంకాలమ్మ గుడి ఆవరణంలో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్సీపీ మండల కన్వినర్ బత్తుల నాగేశ్వరరావు, యాదవ హక్కులపోరాటసమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల క్రిష్ణయ్య యాదవ్ సంక్షేమ పథకాలతో ఆయన ఇంకా పేద గుండెల్లో బతికి ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల సర్పంచి దేవమణి, వైఎస్సార్సీపీ నాయకులు కాకనూరు మనోహర్రెడ్డి, రాఘవరెడ్డి.లక్ష్మికాంత్రెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి, బత్తుల రాజు, పెద్దమాదిగ రాముడు, రాంప్రసాద్, అక్కల గోపాలు, రమణయ్య, శివప్రసాద్ రెడ్డి, దస్తగిరి, వెంకటసుబ్బయ్య, రామయ్య, జమాల్, ఉసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంటలో యాజమాన్య పద్ధతుల పై రైతులకు అవగాహన మండల వ్యవసాయాధికారి - కె. సునీత.

దొర్నిపాడు, సెప్టెంబర్:02, శ్రీ ప్రస్థానం న్యూస్:- ఖరీఫ్ సీజన్లో భాగంగా వివిధ దశల్లో ఉన్న పంటలు నీటి ముంపునకు గురైనపుడు చీడ పీడలు, సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనీ అందుకుగుణంగా రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే సరి వాటిని నివారించవచ్చునని మండల వ్యవసాయా ధికారినీ కె.సునీత తెలిపారు.సోమవారము మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాల యంలో ఏ.ఓ.అద్య క్షన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అల్ప పీడన ప్రభావంతో గత కొన్ని రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు సాగు చేసినటు వంటి ప్రత్తి, మిరుప,కంది, జొన్న వంటి పలు రకాల పంటలు నీటి ముంపునకు గురి అయినప్పుడు నిల్వ ఉన్న నీరు ను తొలగించేందుకు పాటించ వలసిన పద్ధతుల పై రైతులకు అవగాహన కల్పించారు.పత్తి నీటి ముంపునకు గురైనపుడు పూత, పిందె, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారడం వాడిపోవడం జరుగుతుందనీ. పత్తి పంట నీటి ముంపునకు గురైనప్పుడు మురుగు నీటిని తీసివేయడంతో పాటుగా 2.% పొటాషియం నైట్రేట్ మరియు యూరియా ద్రావణాన్ని 30 రోజులలోపు పంటపై 11. 30 రోజులపై ఒడిన పంటలలో 2.1. యూరియా ద్రావణాన్ని వారం వ్యవదిలో మార్చి మార్చి పిచికారి చేయాలని పొలం ఆరిన వెంటనే అంతర కృషి చేసుకోవాలి. ఇలా చేసుకోమ ఉం ద్వారా పొలం త్వరగా ఆరడం జరుగు తుందన్నారు ఇటువంటి వాతావరణ పరిస్థితులలో వేరుకుళ్ళు తెగులు, బ్యాక్టీరియా నల్లమచ్చ తెగులు, తుప్పు తెగులు ఎక్కువగా ఆశించి నష్టం చేకూర్చునని.. ఆమె అన్నారు. వేరు నల్లమచ్చ తెగులు నివారణకు 100 గా) స్ట్రెప్టోసైక్లిన్ మరియు 3గా).. కాఫర్ ఆక్సీక్లోరైడ్ పిచికారి చేసుకోవాలి. 1) కంది పంట ప్రస్తుతం శాఖీయ దశలో వుంది కంది పంట నీటి ముంపునకు గురైనపుడు మురుగు నీటిని తీసి వేయడంతో పాటుగా ఎండగా ఉన్నసమ యంలో 2% పొటాషియం నైట్రేట్ ఒ 2: యూరియా ద్రావణాన్ని పిచికారి చేయాలి. కంది పొలంలో నీరు నిల్వ ఉండటం వలన ఎండు తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం వుంది కనుక 3ఆ), కాపర్ ఆక్సీక్లోరై3గా).. డ లేదా !గా) కార్బండిజమ్ కలిపిన మందు ద్రావణాన్ని మొక్కల చుట్టూ వేరు మండలం తడిచేలా పోయాలి ఏ.ఓ.సునీత రైతులకు పలు అంశాలను గూర్చి తెలియ జేశారు.. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం పుట్టినరోజు వేడుకలు.

కేకు కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రంలోని అమ్మవారి శాల సెంటర్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ యువ నాయకులు ఇరిగెల జయేంద్ర రెడ్డి, ఇరిగెల భరత్ కుమార్ రెడ్డి లు ఇరువురు కలిసి రుద్రవరం మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల, అభిమానుల సమక్షంలో అమ్మవారి శాల సెంటర్లో అంగరంగ వైభవంగా కేక్ కట్ చేసి మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగలింగమయ్య గౌడ్, డేవిడ్, బన్నీ, ఎద్దుల చంటి ఓబయ్య, పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజున గ్రామ సచివాలయం దగ్గర మొక్కలు నాటుతున్న జనసేన కార్యకర్తలు



శ్రీ ప్రస్థానం న్యూస్: సంజామల మండల పారిది లోని ముదిగేడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు గౌరవనీయులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి పుట్టినరోజు సందర్భంగా ముదిగేడు గ్రామంలోని జనసేన కార్యకర్తలు కేక్ కట్ చేసుకుని పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. అంతేకాకుండా గ్రామ సచివాలయ దగ్గర జనసేన కార్యకర్తలు వడ్ల బార హిమం, కిట్టు మహాత్మ రాజేష్ సోముల రామ్మోహన్ రెడ్డి పెద్ద చంద్ర ఓబులేసు మొక్కలు నాటి జనసేన కార్యకర్తలు గ్రామ ప్రజలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా వైయస్సార్ వర్ధంతి

శ్రీ ప్రస్థానం-గడివేముల :- సెప్టెంబర్ 3:- మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలు మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో వైయస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని బూజునూరు గ్రామంలో దివంగత నేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైఎస్ఆర్ సీపీ నాయకులు శివరామిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో మహానేత వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వైయస్ఆర్సీపీ నాయకులు మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వై.యస్ రాజశేఖర్ రెడ్డి గారి 15 వర్ధంతిని పురష్కరించుకుని స్థానిక 2వ రోడ్డు లోని వై.యస్.ఆర్.సి. పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్ బి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఫీజు రీంబర్స్మెంట్ ఇలా ఎన్నో పథకాలతో, బడి ఈడు పిల్లల నుండి పండు ముసలివారి వరకు సంక్షేమ సారధిగా పేదల ఎదుగుదలకు బాటలు వేసిన మహనీయుడు ఆ దివంగత నేత వై.యస్ రాజశేఖర్ రెడ్డి గారని, వారి భౌతికంగా మనకు దూరం ఉన్నా, వారి పథకాల ద్వారా లబ్ది పొందిన ప్రతి ఒక్కరి చిరునవ్వులో ఎప్పటికి కలకాలం నిలిచి ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వంగాల మహేష్ రెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని ,వైఎస్ఆర్సిపి నాయకులు బొంతల మధుసూదన గుప్తా, సివి రమణయ్య, నంద్యాల వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757